పరీక్ష కేంద్రంలో మూర్ఛతో పడిపోయిన టెన్త్ విద్యార్థి

నేలకొండపల్లి ఆస్పత్రిలో వైద్య పరీక్షల తర్వాత పరీక్ష రాసిన వైనం

నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ధనుష్‌కు చికిత్స చేస్తున్న వైద్యులు

కూసుమంచి(నేలకొండపల్లి), మార్చి 21 : పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి మూర్ఛతో పడిపోవడంతో వెంటనే నిర్వాహకులు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. మళ్లీ పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చి పరీక్ష రాయించారు. ఈ ఘటన నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చెరువుమాధారం పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బోయిన ధనుష్ తెలుగు పరీక్షకు హాజరయ్యాడు. అతడికి ఫిట్స్ ఉండడం.. మాత్రలు వేసుకోకపోవడం.. పరీక్షల టెన్షన్‌లో ఏమీ తినకుండా రావడంతో పరీక్ష మొదలైన కొద్ది సేపటికే ఫిట్స్ వచ్చి హాలులోనే పడిపోయాడు. దీంతో నిర్వాహకులు ధనుష్‌ను హుటాహుటిన 108 వాహనంలో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ రాజేశ్ ఫిట్స్‌గా గుర్తించి వైద్య పరీక్షలు చేసిన తర్వాత మళ్లీ చెరువు చెరువుమాధారం పరీక్ష కేంద్రానికి పంపించారు. దీంతో ధనుష్ పరీక్ష రాశాడు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని వైద్యుడు రాజేశ్ విద్యార్థులకు సూచించారు.

ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన పెట్రోలియం డీలర్లు

లీగల్ మెట్రాలజీ అధికారిని కలిసిన పెట్రోలియం డీలర్లు

రఘునాథపాలెం, మార్చి 21 : లీగల్ మెట్రాలజీ ఆఫీసర్‌గా నియమితులైన బి.ప్రవీణ్‌కుమార్‌ను శుక్రవారం ఖమ్మంజిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరప్రగడ రంగనాథ్, జనరల్ సెక్రటరీ కూరపాటి మంజుల, కోశాధికారి వజనేపల్లి శ్రీనివాసకుమార్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మోతుకూరి గోపాలరావు, వెగ్గళం శ్రీనివాస్, మద్ది పిచ్చయ్య, దమ్మాలపాటి నగేశ్, అద్దంకి విప్లవ్‌కుమార్, గోళ్ల జనార్దనరావు, కీమా నాయక్ పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్ నివారణే లక్ష్యం

ఖమ్మం సిటీ, మార్చి 21 : మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ పూర్తి నివారణే తమ లక్ష్యమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు అన్నారు. స్వస్థ మహిళ- స్వస్థ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వెంకటేశ్వరనగర్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల్లో అవగాహన లేకపోవడంతోనే బ్రెస్ట్ క్యాన్సర్ నానాటికి పెరిగి పోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇరవై ఏండ్ల నుంచి 60ఏండ్లలోపు మహిళలు విధిగా సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, సీహెచ్‌వో రాజేశ్వరి, సూపర్‌వైజర్ జయపాల్ విజయ్‌కుమార్, ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ బీ హరిత, కో-ఆర్డినేటర్లు కే విద్య, ఆసుపత్రి సిబ్బంది ఉమారాణి, ముదాసర్, పీ పావని, పీ సత్యవతి, హహనాజ్ భాను, ఏఎన్ఎంలు శారద, ప్రసన్న, రహీంబి, సంధ్య, కావ్య పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

ఖమ్మం సిటీ, మార్చి 21: యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు అన్నారు. శుక్రవారం మహిళా ప్రాంగణం మేనేజర్ విజేత ఆధ్వర్యంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న స్టాఫ్ నర్సులకు ఒక్కరోజు యోగ శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా వల్ల గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రోగ్రాం అధికారి రామారావు మాట్లాడుతూ ప్రతిరోజూ గంట యోగ చేయాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది ఎన్.రఘురాం, కే రవితేజ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **గట్టిగుండె కవిత, W/o : గట్టిగుండె నవీన్ ప్రసాద్, వయస్సు:** 37సం||లు, వృత్తి : గృహిణి, నివాసం: 1-504/2, హీరో షోరూమ్ వెనుక, బంజారా కాలనీ, మధిర, మధిర మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ మధిర సబ్ రిజిస్ట్రార్ వారి పరిధిలోని ఖమ్మం రెవిన్యూ డివిజన్, మధిర మండల పరిషత్, మధిర రెవిన్యూ మండలం, కృష్ణాపురం గ్రామ పంచాయితి పరిధిలోని మునగాల శివారు క్రిష్టాపురం గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా సర్వే నెం. 66/1, 66/9 మింజుమలే ప్లాట్ నెం. 32గా గల చ||గ|| 200ల (చ||మీ|| 167.22లు), **డాక్యుమెంట్ నెం. 58/2025,** అట్టి ఖాళీ నివేసన స్థలమునకు హద్దులు : **తూర్పు :** ప్లాట్ నెం. 15, 16, **దక్షిణము :** ప్లాట్ నెం. 31, **పడమర :** 25 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరము :** ప్లాట్ నెం. 33.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ద్విచక్ర వాహనం దగ్ధం

కూసుమంచి(నేలకొండపల్లి), మార్చి 21: ఇంటి వద్ద ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటన మండలంలోని నాచేపల్లిలో చోటు చేసుకున్నది. నాచేపల్లి గ్రామానికి చెందిన గోగుల రామయ్య ద్విచక్ర వాహనం ఇంటి వద్ద ఉండగా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకొని వెళ్లి పక్కనే ఉన్న కాలువ వద్ద దగ్ధం చేశారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న రైతులు దగ్ధమైన వాహనాన్ని గుర్తించి రామయ్యకు సమాచారమిచ్చారు. రామయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్-2025-26ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, మార్చి 21 : జిల్లాలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. వ్యవసాయ రుణాలను సకాలంలో అందించి లక్ష్యాలను సాధించాలని, రైతులు పంట రుణాలను సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్రస్థాయిలో శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు ప్రజలకు నూరుశాతం డిజిటల్ సేవలు అందించేలా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్-2025-26ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్బీ ఎల్‌డీఎం పల్లవి, నాబార్డ్ డీడీఎం సుజిత్‌కుమార్, ఎస్‌బీఐ ఆర్ఎం జి.లింగస్వామి, హన్మంతరెడ్డి, విజయ్, నవీన్‌బాబు, వాసవి రాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జోనల్ వ్యవస్థకు ఏర్పాట్లు

పౌర సేవలు ఇక మరింత సమీపం

భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం, మార్చి 21 : పెరుగుతున్న జనాభా, ఖమ్మం నగర పరిపాలన అవసరాలను తీర్చేందుకు ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య విధానపరమైన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఒకే కార్యాలయం ద్వారా 60 డివిజన్ల ప్రజలకు పౌర సేవలు అందించబడుతున్నాయి. అయితే, మహా నగరాలకు దీటుగా పాలనను వికేంద్రీకరించి పౌర సేవలను మరింత సమీపంగా తీసుకురావడానికి ఖమ్మం నగరంలో జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం కమిషనర్ ఇతర అధికారులతో కలిసి నగరంలో నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోనల్ కార్యాలయాల ఏర్పాటు కోసం అనువైన భవనాలను పరిశీలించారు. గొల్లగూడెం, చర్చి కాంపౌండ్, 3 టౌన్, పాత మున్సిపల్ కార్యాలయాలు వంటి ప్రభుత్వ భవనాల ప్రాథమిక పరిశీలన పూర్తయింది. ప్రతి జోనల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, పవర్ సర్వీసులు వంటి విభాగాలకు చెందిన 17మంది అధికారుల బృందం సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే అందుబాటులోకి తేవాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ చర్యల ద్వారా ఖమ్మం నగర ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పౌర సేవలు అందనున్నాయి.

రైతుల అభ్యున్నతే డీసీసీబీ లక్ష్యం

రఘునాథపాలెం, మార్చి 21 : రైతుల అభ్యున్నతికి పాటుపడటమే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలోని టీఎస్ ప్రసాద్ సమావేశ మందిరంలో 126 మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలోని సహకార సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. సంఘాల సేవలకు అనుగుణంగా బైలాన్‌ను సవరించి ఆమోదించారు. పలు తీర్మానాలను సభలో సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీవో జీ గంగాధర్‌రావు, ఖమ్మం డీఏవో డి పుల్లారావు, బ్యాంక్ సీఈవో వెంకట ఆదిత్య, పాలకవర్గ సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్‌పై దృష్టి సారించాలి

ఖమ్మం, మార్చి 21 : ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా శుక్రవారం శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ జవాన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 60మంది శానిటరీ జవాన్లు తమ తమ డివిజన్లలో కమర్షియల్ షాపింగ్ మాల్స్, ఆలయాలు, మసీదులు, చర్చిలు వంటి జన సముదాయం ఉన్న ప్రాంతాలకు వెళ్లి స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ సేకరించాలని అధికారులకు సూచించారు. అదనంగా ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంతకుముందు లైసెన్స్ తీసుకున్న వారు రెన్యువల్ చేసుకున్నారా లేదా అనే విషయాన్ని సమీక్షించాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ వసూలు విషయంలో బిల్ కలెక్టర్లకు సహకరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని, ఈ నెల 30వ తేదీ వరకు ఎవరికీ సెలవులు ఉండవని సూచించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 21; రైతుల న్యాయమైనా డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళనలను నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాలను ధ్వంసం చేసి రైతులను అరెస్టు చేయాడాన్ని నిరసిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శుక్రవారం నగరంలోని బైపాస్‌రోడ్డులో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు మాట్లాడారు. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. మోడీ ప్రభుత్వానికి కూడా పతనం తప్పదన్నారు. జగత్‌సింగ్ దలైవాల్ శాంతియుగంగా 56రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తే ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిందన్నారు. నల్ల చట్టాల రద్దు హామీ నాడే మద్దతు ధరలపై కూడా హామీ ఇచ్చరని గుర్తుచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దండి సురేష్, గోవిందరావు, కళావతి, వెంకటరెడ్డి, వెంకటేశ్వరావు, రాంమాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా మల్లయ్య

ఖమ్మం, మార్చి 21: ఉమ్మడి ఖమ్మంజిల్లా ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్ అండ్ ఆపరేషన్)గా వి.మల్లయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మంలో డిప్యూటీ ఆర్ఎంలుగా పనిచేసిన భవాని ప్రసాద్ మహబూబ్‌నగర్‌కు, జీఎన్ పవిత్ర సికింద్రాబాద్ రీజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మల్లయ్యకు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరి రామ్, అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రిలో లిఫ్ట్ ఫెయిల్

మహిళ మృతి.. ఇద్దరు సిబ్బందికి గాయాలు

ఖమ్మం సిటీ, మార్చి 21 : ఖమ్మం నెహ్రూనగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో లిఫ్ట్ ఫెయిల్ అయి ఓ మహిళ మృతిచెందగా ఇద్దరు సిబ్బంది తీవ్రగాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ముదిగొండ మండలం వనం వారి కృష్టాపురం గ్రామానికి చెందిన సట్టు సరోజన(55) గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చేరింది. ఆమెకు స్థానిక వైద్యులు శుక్రవారం సర్జరీ చేసి స్టంట్ వేశారు. క్యాథ లాగ్ నుంచి ఐసీయూలోకి తరలిస్తున్న క్రమంలో లిఫ్ట్ సక్రమంగా పని చేయకపోవడంతో ఒక్కసారిగా పైకి తీసుకెళ్లింది. ఆ క్రమంలో డోర్లు సరిగ్గా పడనందున 3వ అంతస్తు నుంచి స్ట్రచర్ మీద ఉన్న మహిళ లిఫ్ట్ గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో ఆమె తలకు దెబ్బతగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మహిళను తరలిస్తున్న ఆసుపత్రికి చెందిన ఇద్దరు సిబ్బంది సైతం తీవ్ర గాయాలపాలయ్యారు. లిఫ్టులో ఇరుక్కున్న వారు భయంతో కేకలు వేయడంతో మిగతా సిబ్బంది వచ్చి వారిని బయటకు లాగారు. సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు పెద్దఎత్తున తరలివచ్చి ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించగా ఖమ్మం టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు తీసుకున్నారు. ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పి వివాదాన్ని సద్దుమణిగించే ప్రయత్నం చేశారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

సత్తుపల్లిటౌన్, మార్చి 21: మానవాళి మనుగడకు అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని సత్తుపల్లి రేంజర్ పీ.స్నేహలత అన్నారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో అటవీశాఖ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్‌పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌వో ముత్యాలరావు, ఎఫ్ఎస్‌వోలు నరసింహ, కొండారెడ్డి, అరుణ్, నాగరాజు, రమేశ్, ఓట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మళకుంటలో..

పెనుబల్లి, మార్చి 21: మండలంలోని బ్రాహ్మళకుంటలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లాడ రేంజ్ అధికారి ఉమా మాట్లాడుతూ అడవుల వల్ల ఎంతో ఉపయోగాలున్నాయని, మొక్కలు పెంచాలి తప్ప నరక వద్దన్నారు. మనం వాటిని పెంచితే అవి మనకు ఆక్సిజన్‌ను ఇచ్చి ప్రాణాలు కాపాడుతాయన్నారు. అడవి జంతువుల పట్ల ప్రేమ, అప్యాయతలు చూపించాలని, వాటి సంరక్షణే ధ్యేయంగా ఉండాలన్నారు. అడవులను కాపాడటం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సురేశ్‌కుమార్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు ప్రసాద్‌లింగం, మస్తాన్‌రావు, లావణ్య, సమత, అరుణకుమారి, సిబ్బంది ఉన్నారు.

ముస్లింలకు సండ్ర ఇఫ్తార్‌విందు

ముస్లింలకు ఖర్జూర పండు తినిపిస్తున్న సండ్ర

సత్తుపల్లి టౌన్, మార్చి 21: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు రోజా (ఉపవాసం) ఉన్నందున మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి జమే మసీదులో శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ కఠోర ఉపవాస దీక్షను చేసి సాయంత్రం వేళలో ఉపవాసం వీడిచే (ఇఫ్తార్) ఏర్పాటు చేసే అవకాశం భగవంతుడు తనకు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ మల్లూరి అంకంరాజు, చాంద్‌పాషా, అద్దంకి అనిల్, బీఆర్ఎస్ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు రఫీ, మసీదు సదరు నయాబ్ రసూల్, న్యాయవాది పాషా, సలాం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందనలు

వైశాలిని సన్మానిస్తున్న కలెక్టర్, డీవైఎస్‌వో

ఖమ్మం సిటీ, మార్చి 21 : జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్ పతకం సాధించిన ఖమ్మం క్రీడాకారిణి బీ వైశాలిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఐడీవోసీ భవనంలో శుక్రవారం అభినందించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలో జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 20వ జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. వాటిల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణి వైశాలి రజత పతకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆమెను జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి కలెక్టర్ వద్దకు తీసుకెళ్లగా వైశాలితోపాటు ఆమె తండ్రి కొండా యాదవ్, కోచ్ ఎండీ గౌస్‌ను శాలువాతో సత్కరించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ నున్నా రాధాకృష్ణ, సెక్రెటరీ ఎండీ షఫీక్ అహ్మద్‌లు సైతం క్రీడాకారిణికి అభినందనలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మధిర, మార్చి 21: పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని బీఆర్ఎస్ పట్టణ, రూరల్ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కనుమూరు వెంకటేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను శుక్రవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, మొండితోక జయకర్, బిక్కి కృష్ణప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కొఠారి రాఘవరావు, అబ్బూరి రామన్, బాణాల శంకరాచారి, గద్దల స్వామి, తేల కొండలరావు, కుర్ర అప్పారావు, అంతా బాబు, రాయుడు భద్రయ్య, వినుకొండ మురళీకృష్ణ, దామ శేషగిరి పాల్గొన్నారు.

సబ్ మార్కెట్‌లో షాపులు ఏర్పాటు చేస్తాం

బోనకల్లు, మార్చి 21: బోనకల్లు సబ్ మార్కెట్లో షాపులను ఏర్పాటు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అన్నారు. శుక్రవారం బోనకల్లులోని మధిర మార్కెట్ పరిధిలో గల సబ్ మార్కెట్, చిరునోములలో ఏర్పాటుచేసిన గోదాము, చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... మధిర వ్యవసాయ మార్కెట్‌కు ఆర్థిక వనరులు సమకూర్చడం కోసం ఖమ్మం వెళ్లే రోడ్లో షాపులు నిర్మిస్తామన్నారు. అదే విధంగా చిరునోముల గోదాము చుట్టూ సీసీ రోడ్ నిర్మాణంతో పాటు మరో గోదాము నిర్మాణం కోసం ప్రణాళిక తయారు చేస్తున్ననట్లు తెలిపారు. కార్యక్రమంలో మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్, పైడిపల్లి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నాగప్రసాద్‌ను పరామర్శించిన సండ్ర

పెనుబల్లి, మార్చి21: కల్లూరు మండలం లింగాల గ్రామానికి చెందిన దేవరపల్లి నాగప్రసాద్ ఇటీవల కంటి చికిత్స చేయించుకోగా ఆయనను సత్తుపల్లి మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

PLOT FOR SALE

★విజయవాడ హైవే చౌటుప్పల్ దగ్గర RRRకు అనుకుని ఉన్న HMDA వెంచర్‌లో 167 గ|| 22 లక్షలు మాత్రమే. ఫ్రీ రిజిస్ట్రేషన్. 9154102338.
NT-331068

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణ

ఖమ్మం రూరల్, మార్చి 21: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వాహపై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని ఏదులాపురం మున్సిపాలిటి కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం, పెద్దతండాలో పలు డివిజన్‌లలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ఇందుకు గాను మొత్తం 9టీంలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య నిర్వాహణ అధికారులు టీ కిరణ్, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుకు రూ.20 వేలు సాయం

రఘునాథపాలెం, మార్చి 21: కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న జర్నలిస్టుకు టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) అండగా నిలిచింది. ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పేరబోయిన తిరుపతిరావు గత కొద్దిరోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే బృందం శుక్రవారం ప్రశాంతినగర్‌లోని తిరుపతిరావు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంది. వైద్య ఖర్చులకు రూ.20 వేలు సాయం అందజేసింది. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిన్నారవి, సాంబశివరావు, రజినీకాంత్, శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, టీఎస్ చక్రవర్తి, నాగయ్య పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థుల ఎంపిక

ఖమ్మం అర్బన్, మార్చి 21: ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 46 మంది ఎంపికైనట్లు చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం జరిగిన రెనాల్ట్ నిస్సాన్‌కి చెందిన ప్రక్రియలో వివిధ దశల్లో సత్తా చాటారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఆరు చెక్ డ్యాంలు మంజూరు

కూసుమంచి, మార్చి 21: పాలేరు నియోజకర్గంలోని నాలుగు మండలాల్లో రూ. 32.44 కోట్లతో ఆరు చెక్ డ్యాంలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫార్సు మేరకు ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపాలెం మండలం పాలేరు నియోజవర్గంలోని జాన్‌బాద్ తండాలో రూ 6.38 కోట్లు, రూరల్ మండలం ఒట్టివారు తండా 6.75కోట్లు, కూసుమంచి మండలం జక్కేపల్లిలో రూ. 5.79 కోట్లు, నేలకొండపల్లి మండలం చెన్నారంలో రూ.6.65 కోట్లు, పైనంపల్లిలో రూ.4.33 కోట్లు, సదాశివపురంలో 2.54 కోట్లతో చెక్ డ్యాంలను మంజూరు చేశారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

కూసుమంచి, మార్చి 21: తెలంగాణ రావటానికి శక్తి వంచన లేకుండా కష్ట పడిన ఉద్యమకారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చేగొమ్మలో శుక్రవారం జరిగిన జిల్లా జేఏసీ సమావేశంలో సోమయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, ఉద్యమ కారులకు 250 గజాల స్థలం నెలకు రూ. 25 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా ఉద్యమకారుల జేఏసీ నూతన అధ్యక్షుడిగా అంబాల రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్‌శాఖలో 'హైపర్' కార్యాచరణ

మామిళ్లగూడెం,మార్చి 21: ప్రకృతి వైపరీత్యాలు భారీ వర్షాలు, ఈదురుగాలులు వంటివి సంభవించినప్పుడు అతి తక్కువ సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టడానికి హైపర్ అనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఖమ్మం సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసాచారి శుక్రవారం తెలిపారు. ఈ ప్రణాళిక విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్లపై నేడు అవగాహన

పంట పొలాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో ఉన్న విద్యుత్‌శాఖ గెస్ట్‌హౌజ్‌లో శనివారం ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందని ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కూసుమంచి, మార్చి 21 : ఎలుకల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో గురువారం రాత్రి మృతిచెందిన ఘటన గంగబండతండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బానోత్ ఉపేందర్(25) ఈ నెల 14న అదే తండాలోని నాగేశ్వరరావు దుకాణంలో ఎలుకల మందు కొనుగోలు చేసి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. కాగా.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తండాకు తీసుకురాగా.. ఆందోళన చేయాలనే యత్నిస్తున్న విషయం తెలుసుకుని ముందుగానే పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి ఎస్సై సంతోశ్, తిరుమలాయపాలెం ఎస్సై జగదీశ్, కూసుమంచి ట్రైనీ ఎస్సై దివ్యశ్రీ. కూసుమంచి పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడి తండ్రి కోట్యా ఫిర్యాదు మేరకు ఎలుకల మందు అమ్మిన నాగేశ్వరరావుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సత్తుపల్లిటౌన్, మార్చి 21: మండలంలోని బేతుపల్లి వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. అడప రాజేంద్రప్రసాద్ ఆయన భార్య పుష్పావతి (50) కారులో అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వస్తుండగా బేతుపల్లి వద్ద ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పుష్పావతి అక్కడికక్కడే మృతిచెందగా ఆమె భర్త రాజేంద్రప్రసాద్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అశ్వారావుపేటలోని గుడిలో జరిగిన కల్యాణంలో కుర్చున్న అల్లుడు, కూతురికి బట్టలు పెట్టి తిరిగి ఇంటి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

పంటలను పరిశీలించిన అధికారులు

కూసుమంచి, మార్చి 21: మండలంలోని మునిగేపల్లి లోగల ఊర చెరువు కింద సాగవుతున్న 100 ఎకరాల్లోని వరి, మక్క పంటలను ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సమస్య రాకుండా చేస్తామని, ప్రత్యామ్నాయంగా ఎస్సార్‌ఎస్పీ నుంచి నీటిని మళ్లించే విధంగా ప్రయత్నిస్తామని రైతులకు తెలిపారు. ఆయకట్టు పరిధిలో 80 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో మొక్క జొన్న పంట ఉందని దానిని కాపాడాలని రైతులు కోరారు. మునిగేపల్లి చెరువులో ప్రస్తుతం ఉన్న నీరు తూములకు అందక పోవటంతో పంట పొలాలకు నీరు అందటం లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ సరిత ఇరిగేషన్ డీఈ రత్నకుమారి, వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణి, టెక్నికల్ ఏవో అరుణ, ఏఈవో రవీందర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంఎస్‌ఎఫ్ నాయకులు

వైరాటౌన్/ఎర్రుపాలెం, మార్చి 21: ఎర్రుపాలెం మండలంలో విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రత్నాకర్ శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి విన్నవించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను రత్నాకర్ కలిశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఏపీలోని కృష్ణా జిల్లాలో విద్యార్థులు చదువుకున్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో వారు నాన్ లోకల్‌గా పరిగణించబడుతున్నారు. అటు కృష్ణా జిల్లాలో కూడా నాన్ లోకల్‌గానే ఉంటున్నారు. దీనివలన బార్డర్‌లో ఉన్న విద్యార్థులు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యే వారిని రెండు రాష్ట్రాల్లో నాన్ లోకల్‌గా పరిగణించడం వలన రిజర్వేషన్ కోటాను కోల్పోవాల్సి వస్తుంది. బోర్డర్‌లో ఉన్న విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జగదీశ్వరి కుటుంబానికి పరామర్శ

సత్తుపల్లిటౌన్, మార్చి 21: సత్తుపల్లి పట్టణానికి చెందిన గంగుల జగదీశ్వరి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని సత్తుపల్లి మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పరామర్శించారు. తొలుత జగదీశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సండ్ర వెంట కొత్తూరు ఉమ, దొడ్డా శంకర్‌రావు, వాసు, అంకంరాజు, అమరవరపు కృష్ణారావు, అద్దంకి అనిల్, చాంద్‌పాషా ఉన్నారు.

సత్యనారాయణకు నివాళి

మధిర, మార్చి 21: పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గుమ్మడిపూడి సత్యనారాయణ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సత్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రూ. 80 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ముదిగొండ, మార్చి 21: మండలంలోని న్యూ లక్ష్మీపురం సబ్ స్టేషన్‌లో రూ. 80 లక్షలతో ఏర్పాటుచేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఎస్ఈ శ్రీనివాసాచారి ప్రారంభించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఈ ట్రాన్స్‌ఫారమ్ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈలు నాగేశ్వరరావు, జె భద్రు పవార్, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.